విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 31 జనవరి 2025 8 పేజీలు

చంద్రబాబు నిర్ణయంతో వైద్య విద్యకు పేదలు దూరం

- ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తారా?
- కూటమి ప్రభుత్వ నిర్వాకంతో 2,450ఎంబిబిఎస్ సీట్లు నష్టం
- సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

విశాలాంధ్ర రాజమండ్రి: రాష్ట్ర వ్యాప్తంగా 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు నిర్మాణంలో ఉన్నాయని ఆ కళాశాలలు తాము నిర్మించలేమని కూటమి ప్రభుత్వం నేసనల్ మెడికల్ కమిషన్‌కు లేఖ వ్రాసి 2025 విద్యా సంవత్సరం 700 ఎం బి బిఎస్ సీట్లు నష్టం కలిగించేలా చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు విమర్శించారు. గురు వారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్లో 13 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నాయని, 2023లో ఆనాటి ప్రభుత్వం రూ .8480 కోట్లతో 17 గవర్నమెంట్ మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రారంభించిందని, 2023 సెప్టెంబర్ నాటికి విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో ప్రారంభించారు కానీ 2024కి ఐదు గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పాడేరు పులివెందులలో ప్రారంభం కావాల్సి ఉండగా పాడేరులో కేవలం 50 సీట్లుతో ప్రారంభించి మిగతా చోట్ల అక్కర్లేదని నేషనల్ మెడికల్ కమిషన్‌కు లేఖ రాశారని మధు పేర్కొన్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి 7 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పాలకొల్లు, పార్వతీపురం, పిడుగురాళ్లు, పెనుగొండలో ప్రారంభం కావాలని ఇవన్నీ నిర్మాణ దశల్లో ఉన్నాయని, ప్రారంభం కాని 11 కాలేజీ లను మూసి వేయడానికి సేఫ్ క్లోజ్ కోసం జీవో నెంబర్ 27 జారీ చేసి ఒక కమిటీని ఏర్పాటు ▶మిగతా 2లో..

గిరిజన ప్రాంతాల్లో విద్యా, వైద్య వ్యవస్థలు పటిష్టం

- మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యం
- పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: గిరిజన ప్రాంతాల్లో విద్యా,వైద్యం ,ఇతర మౌలిక సదుపాయాలను పటిష్టం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో కె.ఆర్.పురం ఐటిడిఏ పరిధిలో విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆదర్శ ఐటిడిఏగా కె.ఆర్.పురం ఐటిడిఏను నిలిపే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో సమష్టి కృషి చేయాలన్నారు. ఐటిడిఏ ▶మిగతా 2లో..

46 చెరువుల్లోకి చేప పిల్లలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : జిల్లాలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 3,23,820 చేప పిల్లలను, జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో 46 మైనర్ ఇరిగేషన్ చెరువులలో మత్స్యకారుల సొసైటీ లకు అందుబాటులో ఉండేలా చేప పిల్లలను విడుదల చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు.

గురువారం రాజానగరం మండలం నందరాడ గ్రామ పంచాయతీ అడుసుమిల్లి వెంకయ్య చెరువులో చేప పిల్లల విడుదల కార్యక్రమంలో కలెక్టర్ పి. ప్రశాంతి అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేప పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మత్స్యకార సహకార సంఘాలకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. దీని వలన జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ చెరువులలోని చేపల ఉత్పత్తితో పాటు ఉత్పాదకత ▶మిగతా 2లో..

అధికారుల సమన్వయంతో అంతర్వేది ఉత్సవాలు

విశాలాంధ్ర - రాజోలు : ఫిబ్రవరి 4 నుండి 13వ తేదీ వరకు సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి తిరు కళ్యాణ ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తూ ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా అధికారులు సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం అంతర్వేది దేవాలయ పరిసర ప్రాంతాలు బీచ్, ఫెర్రీ పాయింట్లను పరిశీలించి అనంతరం కళ్యాణ వేదిక వద్ద జిల్లాస్థాయి అధికారులతో ఉత్సవ ఏర్పాట్లు పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు అసౌకర్యానికిలోను కాకుండా పూర్తి స్థాయిలో అన్ని

ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దేవాలయ ప్రాంతం బీచు బోటుపార్కింగ్ తదితర ప్రాంతాలను భక్తులు సులభతరంగా గుర్తించేందుకు పంచాయతీ రాజ్ విభాగం వారు సైన్‌బోర్డులు, దేవాలయ ప్రాంగణంలో లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవస్థానంలో ప్రధాన కమాండ్ కంట్రోల్ రూమ్, బీచ్ వద్ద మినీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 21 శాఖలు సిబ్బంది 24/7 పనిచేయడం జరుగుతుందని కమాండ్ కంట్రోల్ రూమ్కు వివిధ ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్ అనుసంధానం చేస్తూ మొత్తం వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు. బస్టాండు తదితర ప్రాంతాలు, పారిశుద్ధ్యం, లైటింగ్ ఏర్పాట్లు బీచ్ వద్ద సెక్యూరిటీ తదితర ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేపట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలకు ▶మిగతా 2లో..

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల వాగ్దానం మేరకు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణాలు,గ్రామీణ ప్రాంతాలలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాల అర్జీలు పూర్తిచేసి స్థానిక చేపల తూము సెంటర్ వార్డు సచివాలయంలో వార్డు కార్యదర్శికి అందజేశారు. అనంతరం మన్నవ కృష్ణ చైతన్య మీడియాతో మాట్లాడుతూ ఇళ్ల స్థలాల అర్జీ కార్యక్రమం ఫిబ్రవరి 9 నాటికి పూర్తి చేసుకుని 10వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాల యంలో అర్జీల సమర్పణ కార్యక్రమం జరుగు తుందన్నారు. గతంలో సెంటు తీసుకున్న ఇళ్ల స్థలాలను రెండు సెంట్లుగా పెంచాలని,కొత్తగా వచ్చిన అర్జీలను ఆన్ లైన్ చేయాలని, పేదలందరికీ ఇళ్ళు మంజూరు చేయాలని

డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు పేదవారికి పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.1లక్ష 80 వేలు ఇంటి నిర్మాణానికి సరిపోదని,తాము అధికారంలోకి వస్తే రూ.4 లక్షలు ఇస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలతో ఇచ్చిన వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. పెరిగిన నిర్మాణ వ్యయం దృష్టిలో ఉంచుకుని ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయా లని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 10వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు,ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని,ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు, కె. రోజా, బి.లక్ష్మి, ఎ. మల్లీశ్వరి, శ్రావణి, ఉమా గౌరీ, కె.చంద్రకుమారి, ఎం.కోటేశ్వరి, బి.ప్రసన్నరాణి, కె.దేవి, వి. స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలి

విశాలాంధ్ర-ఏలూరు: ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఆయా ప్రాంతాల్లో ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏలూరు,

పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, జిల్లాలలోని డిఆర్ఓలు, ఆర్డీవోలు, తదితరులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె ▶మిగతా 2లో..

పెన్నాడ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - పాలకోడేరు : భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, పెన్నాడ కళాశాలకు చెందిన ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు కె. మనోహర్, పి. పావని ఈనెల 21 నుంచి 27 వరకు



అస్సాం అగ్రికల్చర్ యూనివర్సిటీ, జోర్హట్‌లో జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని తమ ప్రతిభ చాటుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పర్తి సురేష్ తెలిపారు. ఈ శిబిరంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతో కలిసి సంస్కృతి, సమైక్యత, నైపుణ్య లక్షణాలు, దేశభక్తి తదితర అంశాలపై విస్తృతంగా చర్చలు, ప్రాక్టికల్స్, తదితర అంశాలలో పాల్గొన్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పదిమంది విద్యార్థులు ఎంపిక కాగా వారిలో ఇద్దరు విద్యార్థులు తమ కళాశాలకు చెందినవారు కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అకాడమిక్ డీన్ డాక్టర్ కురెళ్ళ భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ. బి. ఎస్. ఆర్. మనోహర్ మరియు ఇతర హెచ్ ఓ డి లు అభినందించారు.

గాంధీజీ సేవ యువతకు మార్గదర్శకం

విశాలాంధ్ర-లింగపాలెం: గాంధీజీ సేవలు యువతకు మార్గదర్శకం కావాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. గాంధీజీ

వర్ధంతిని పురస్కరించుకొని ధర్మాజీగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత గాంధీ మార్గంలో పయనించాలని, సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించుకునే బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని తెలిపారు. ఈయనతో పాటు కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

విశాలాంధ్ర-లింగపాలెం: పంచాయతీ కార్యదర్శులకు విధుల నిర్వహణపై లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఎంపీడీవో వాణి, మండల పంచాయతీ

విస్తరణ అధికారి రత్నకుమార్ పలు సూచనలు చేశారు. గ్రామాలలో స్వచ్ఛభారత్ అమలు చేయాలని, ప్రతి ఒక్కరికి మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి ఎద్దడి నివారణకు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం అప్పగించిన వివిధ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలలో ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు పరిశీలన చేసి ఈ కేంద్రాలను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటిపారు దల శాఖ పర్యవేక్షకులు ప్రభుదాస్, కార్యాలయపు పరిపాలన అధికారి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం తహసిల్దార్ డిప్యూటేషన్‌పై బదిలీ

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం తహసిల్దార్‌గా పనిచేస్తున్న సజీమును కలెక్టర్ కార్యాలయానికి డిప్యుటేషన్ పై నియమించారు. కలెక్టర్ కార్యాలయంలోని భూములకు సంబంధించిన విభాగంలో సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈ విభాగంలో ఈయనకు అనుభవం ఉండటంతో డిప్యుటేషన్‌పై నియమించినట్లు తెలిసింది. లింగపాలెం మండల తహసీల్దారుగా కే.కోట మండలంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎలీషాకు డిప్యుటేషన్ బాధ్యతలు అప్పగించారు.

పోటీంచాలి (1వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లకు సంబంధించి వెయ్యికి పైగా ఓటర్లు ఉంటే వేరే పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఈనెల 31వ తేదీన సమర్పించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు,పోలింగ్ కు సంబంధించిన స్టేషనరి సరఫరా, పోస్టల్ బ్యాలెట్, మోడల్ కోడ్ గురించి తహశీల్దార్లకు, నోడల్ అధికారులైన యంపిడివోలకు వివరించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సందేహాలు ఉంటే వారిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు.సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలు (1వ పేజీ తరువాయి)

పెరుగుతుందన్నారు. చేప పిల్లల విదుదల వలన 32 మత్స్యకారుల సహకార సంఘాలలోగల 5300 కుటుంబాలకు జీవనోపాధి మెరుగుపడి ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

చేప పిల్లలను బయట కొనుగోలు చేస్తే ఆర్థికపరంగా సొసైటీలకు కొంత భారం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వమే సీడ్స్‌ను మత్స్యకార సొసైటీలకు అందిస్తుందన్నారు. మూడు, నాలుగు నెలలలో చేప పిల్లలు పెరిగి వారు పట్టుకోవడానికి అందుబాటులో వస్తాయని తద్వారా వారికి ఆదాయం సమకూరుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపలు అధికంగా లభించుట వలన ప్రజలకు మంచి ప్రోటీన్ గల తాజా ఆహారం అందుబాటు ధరలలో లభిస్తుందన్నారు. .ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణా రావు, జిల్లా మత్స్య సహకార సంఘం ప్రెసిడెంట్ బలసాడి రంగారావు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు (1వ పేజీ తరువాయి)

తావులేకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా రవాణా అధికారి ఉత్సవాలకు వచ్చే యాత్రికుల వాహనాలు ఓవర్ లోడ్ లేకుండా ఎప్పటికప్పుడు పరివేక్షించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఏపీడి దేవస్థాన పరిసర ప్రాంతాలలో పారిశుద్యం వ్యవస్థను పర్యవేక్షించాలని ఆదేశించారు. భక్తులకు పారిశు ద్ధ్య పరంగా ఉత్సవాలలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య వ్యవస్థను నిర్వహించా లన్నారు. 11 పార్కింగ్ ప్లేస్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అను సంధానించాల న్నారు. జిల్లా పౌర సరఫరాలు, తూనికలు కొలతలు శాఖ అధి కారులు సమన్వయంతో ధరల నియంత్రణ తూనికలు కొలతలు పై దృష్టి సారించాలని ఫుడ్ సేఫ్టీ అధికా రులు ఉత్సవాలలో ప్రసాదాలు, ఆహార పదార్థాలను వర్తకులు అమ్మే ఆహార పదార్థాల కల్తీలను పర్యవేక్షించాలన్నారు. ఆర్ అండ్ బి అధికారులు రథం ఫిజికల్ ఫిట్నెస్‌ను ధ్రువీకరించాలన్నారు. చక్రస్నానం ప్రక్రియను ఆర్డీవో రామచంద్రపురం వారు పర్యవేక్షించాలన్నారు. ఆర్టీసీ వారు 105 బస్సులను ఏర్పాటు చేస్తూ ప్రయాణికుల రాకపోకలు సురక్షితంగా నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ బోటింగ్ పాయింట్ను అంతర్వేది హార్బర్‌ను సందర్శించి హార్బర్ నిర్వహణ తీరు పట్ల మత్స్యకార సొసైటీల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు సదు పాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. హార్బర్ నిర్వహణ కమిటీ నియమకానికి సంబంధించి అనధికార సభ్యులు ఎంపిక పెండింగ్లో ఉందని మత్స్య శాఖ ఏడి వర్ధన్ జిల్లా కలెక్టర్‌కి వివరించారు. స్థానిక శాసనసభ్యులతో సంప్రదించి అనధికార నలుగురు సభ్యులను నియమించి కమిటీని ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశిం చారు. ఈ కార్య క్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి ఉత్సవ కమిటీ సభ్యులు బాలాజీ, అడ్మిన్ ఎస్పి ప్రసాద్ డిఎస్పీలు, ఆర్డీవోలు డి. అఖిల, కే మాధవి, దేవస్థానం ఈవో సత్యనారాయణ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పటిష్టం (1వ పేజీ తరువాయి)

పరిధిలో విద్యుత్ సౌకర్యం లేని ఏఒక్క గిరిజన గ్రామం ఉండకూడదన్నారు.గిరిజన ప్రాంతంలో రోడ్డు కనెక్టివిటి,టెలిఫోన్ కనెక్టివిటీ, అంతర్గత రహదారులు,త్రాగునీరు,మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను వేగవంతంగా అభివృద్ధి పర్చాలన్నారు. సమావేశంలో పీసా గ్రామ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. కేవలం గురుకుల, ఆశ్రమ పాఠశాలలే కాకుండా గిరిజన ప్రాంతంలోని అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని కలెక్టర్ పేర్కొన్నారు. తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తూనే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్యంపై మరింత ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. మాతా శిశు మరణాల నిర్మూలనకు కృషిచేయాలన్నారు. గర్భిణీలు,బాలింతల విషయాల్లో దృష్టి పెట్టాలన్నారు. ఐటిడిఏ పరిధిలో 104,108 తల్లీ,బిడ్డ సేవలను సమీక్షించారు. మలేరియా,డెంగ్యూ,ఫైలేరియా, చికెన్ ఫాక్స్, వంటి వ్యాధుల నిర్మూలనపై చేపట్టిన చర్యలపై సమీక్షించారు. సమావేశంలో ఐటిడిఏ పిహో కె.రాములు నాయక్,ఏపివో పి.వి.ఎస్. నాయుడు,ట్రైబుల్ వెల్ఫేర్ ఇఇ లత,ట్రైబుల్ వెల్ఫేర్ ఎస్టిని ఐ.కిషోర్, పంచాయితీరాజ్ ఇఇ కె.శ్రీను,ఇన్ చార్జి డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. సురేష్,ఐసిడిఎస్,హౌసింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలు దూరం (1వ పేజీ తరువాయి)

చేశారని ఈ 11 కాలేజీలు ప్రారంభించకపోవ డం వల్ల ఏపీ విద్యార్థులు 2450 మెడికల్ సీట్లను కోల్పోయిందని తెలిపారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని మధు అన్నారు. ఇకనుండి డబ్బు ఉన్న వారు మాత్రమే కోటి రూపాయలు వెచ్చించి ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో ఎంబిబిఎస్‌లో చేరుతారని దీంతో వైద్యం పూర్తిగా సామాన్యుడికి దూరం కానుంది అన్నారు. గత మూడు రోజులుగా సిపిఐ కార్యాలయానికి 30 మంది వరకు నీట్ రాసిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు వచ్చి కూటమి ప్రభుత్వం చేసిన నిర్వాకాన్ని చెబుతూ ఆవేదన వ్యక్తం చేశారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆలోచించి కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాన్ని పూర్తిచేసి మెడికల్ సీట్లు వచ్చేలా ప్రయత్నం చేయాలన్నారు.

లేదంటే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో సంప్రదించి నీట్ విద్యార్థుల తల్లిదండ్రులతో భవిష్యత్తు ఆందోళన చేపడతామని మధు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వి. కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పశు సంవర్ధకశాఖ అధికారికి రాష్ట్రస్థాయి అవార్డు

విశాలాంధ్ర-లింగపాలెం: చింతలపూడి ఏరియా పశుసంవర్ధక శాఖ సహాయసంచా లకులుగా పనిచేస్తున్న పశు వైద్యాధికారి లింగయ్యకు

రాష్ట్రస్థాయి ఉత్తమ పశు వైద్యాధికారి అవార్డును ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ దామోదర నాయుడు అందజేశారు. ఈ ప్రాంతంలో డాక్టర్ లింగయ్య 30 ఏళ్లుగా సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఈయన పర్యవేక్షణ చేస్తున్న ధర్మాజీగూడెం పశు వైద్యశాలలో విధులు నిర్వర్తిస్తున్న అటెండర్ గోపాల్, కంప్యూటర్ ఆపరేటర్ రాధికకు జిల్లాస్థాయి అవార్డులు వచ్చాయి. రాష్ట్రస్థాయిలో అవార్డు తీసుకున్న డాక్టర్ లింగయ్యను లింగపాలెంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ప్రజలు,రైతులు, పార్టీలకతీతంగా నాయకులు అభినందించారు.

భార్యను హత్య చేసిన భర్త

విశాలాంధ్ర-లింగపాలెం: భార్యపై అనుమానంతో భర్త కిరాతకంగా కత్తితో నరికి చంపిన సంఘటన మఠంగూడెం పంచాయతీలో జరిగింది.ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జె.మారేశ్వరరావు భార్య నాగమణిపై అనుమానంతో గొడవ పడుతుండే వాడు.

బుధవారం రాత్రి మద్యం సేవించిన మత్తులో భార్యనిద్రిస్తున్న సమయంలో తాటాకులు నరికే కత్తితో కిరాతకంగా ఈమెను నరికాడు.మెడపై వీపుపై బలమైన గాయలవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘత గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వివరాలు సేకరించారు. భర్తను అదుపులోకి తీసుకున్నారు.సీఐ రవీంద్ర నాయక్ ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్న బాబు,క్లూస్ టీం నిపుణులు వచ్చి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దంపతులకు కూతురు,కొడుకు ఉన్నారు. కూతురుకు వివాహం అయింది. కిరాతకంగా భర్త చేతిలో మృతి చెందిన నాగమణి బిడ్డలతో పాటు,బంధువులు, స్థానికులు విషాదంలో మునిగారు.

మందలపు ప్రసాదరావు సతీమణి మృతికి మందపాటి సంతాపం

విశాలాంధ్ర-చాట్రాయి: తెదేపా సీనియర్ నాయకులు, సికె పాడు సప్లై ఛానల్ నీటి సంఘం మాజీ అధ్యక్షులు మందలపు ప్రసాదరావు భార్య సరోజిని మృతికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి

మందపాటి బసవరెడ్డి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. మండలంలోని చీపురుగూడెం గ్రామానికి చెందిన ప్రసాదరావు భార్య గుండెపోటుతో మరణించారు. గురువారం వారి నివాసంలో భౌతికకాయం వద్ద బసవరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసాద్ రావు కుటుంబంతో గడిచిన మూడు దశాబ్దాలుగా స్నేహ సంబంధాలు ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. ఏపీయుడబ్ల్యూజే సీనియర్ నాయకులు నెల్లూరు కృష్ణారావు,సీనియర్ పాత్రికేయులు వజ్రాల రాజ్ కుమార్,ఈవి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కందుల కృష్ణ, తెలుగు రైతు నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాగంటి బుచ్చిబాబు, టిడిపి నాయకులు మందలపు రాజారావు, తదితరులు ఆమె భౌతికకాయం వద్ద ఘన నివాళులర్పించారు. అనంతరం కుమారుడు మందలపు జగదీష్ సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

జాతిపితకు ఎంపీ నివాళి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు: సత్యాగ్రహమే ఆయుధంగా అహింసామార్గంలో పోరాడి కోట్లాది భారతీయులకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అందించిన జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని ఏలూరు

శాంతినగర్‌లోని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యాలయం సిబ్బంది మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.బ్రిటిష్ పాలకుల కబంధహస్తాల నుంచి భారతదేశానికి విముక్తి కల్పించిన మహోన్నతమైన వ్యక్తి మహాత్మా గాంధీ అని వక్తలు కొనియాడారు. మహాత్ముని అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయ స్ఫూర్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నందిగం సీతారాం తిలక్ (బాబి),కాట్రు బాలకృష్ణ (బాలు),వీర్ల ప్రతాప్, జిల్లా పరిషత్ విశ్రాంత సీఈఓ సిహెచ్ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

విశాలాంధ్ర -భీమవరం: జాతిపిత మహాత్మా గాంధీ మార్గం అనుసరణీయమని జిల్లా రెవిన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు.

గురువారం జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి జిల్లా రెవిన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జాతి సమగ్రతను ఐక్యతను నిలబెట్టేందుకు మహాత్మ గాంధీ అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శమైందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జి.వి.ఆర్.కె. ఎస్.ఎస్.గణపతిరావు, కలెక్టరేట్ ఏ.ఓ.చంద్రశేఖర్, జిల్లా విద్యాశాఖ ఏడి ఎన్.సత్యనారాయణ, సూపరింటెండెంట్ తిరుపతి రాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ కూసింది ...ఫ్లెక్సీల తొలగింపు

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ గురువారం అమలులోకి వచ్చింది. దీంతో

జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ఉన్న ఫ్లెక్సీలు తొలగించి, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేస్తున్నారు. అధికారుల ఆధ్వర్యంలో ఉంగుటూరు, చేబ్రోలు, నారాయణపురం తదితర గ్రామాలలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకులు ఎన్నికల సంఘానికి సహకరించాలని ఉంగుటూరు ఎంపీడీవో గంజి రాజు మనోజ్ కోరారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు తొలగించడం జరుగుతుందన్నారు.

ప్రమాదమని తెలిసినా... ప్రయాణం

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు మండలం చేబ్రోలు రైల్వేస్టేషన్లో అవతల ప్లాట్ ఫారం మీదకు వెళ్లడానికి ఆగి ఉన్న గూడ్స్

కింద నుంచి ప్రయాణికులు వెళుతున్నారు. ప్రమాదమని తెలిసి కూడా మహిళలు వెళ్లడంతో గురువారం రైల్వే సిబ్బంది మందలించారు. ఒక ప్లాట్ఫారం నుంచి మరో ప్లాట్ఫారం కి వెళ్లడానికి రైల్వేస్టేషన్లో బ్రిడ్జి ఉంది. ఆగి ఉన్న రైలు బండి కింద నుంచి వెళ్లడంతో రైల్వే సిబ్బంది ప్రయాణికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

లౌకిక వ్యవస్థ పరిరక్షణకు కృషి చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: లౌకిక వ్యవస్థ పరిరక్షణకు మనమంతా కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏలూరు కోట దిబ్బ సర్వీస్ రిజర్వాయర్ ఒకటి విశ్రాంతి ఉద్యోగుల కార్యాలయం (ఏఐటియుసి) వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ)నాయకులు వాటర్ సప్లై అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాత్మా గాంధీ విగ్రహానికి డి ఈఈ రజాక్ పూలదండ వేసి నివాళులర్పించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఏఈఈ సాయి పూలదండ వేసి జోహార్లు అర్పించారు. అనంతరం యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు, సహాయ కార్యదర్శి ఎస్ఎంవి సుబ్బారావు, యూనియన్ నాయకులు మధ్యాహ్నపు దుర్గారావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ

ఆశయాలకు అనుగుణంగా, మత సామరస్యం కోసం,దేశ సమైక్యత, సమగ్రతల కోసం,లౌకిక వ్యవస్థ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్యాప్ ఇన్స్పెక్టర్ హరినాథ్ బాబు, బొంతు దుర్గారావు,షేక్ అక్బర్ బాషా,పి దుర్గారావు, ఎం. ఆదినారాయణరావు, ఎం.ఎస్.బాజీ, టీ రామారావు తదితరులు గాంధీ విగ్రహం వద్ద పుష్పాలుంచి నివాళులర్పించారు.

అర్హులైన పేదలందరికీ వి.ఎస్.ఎస్. భూములు పంపిణీ చేయాలి

సీపీఐ సీనియర్ నాయకులు ఎం. వసంతరావు

విశాలాంధ్ర-చింతలపూడి: వి.ఎస్.ఎస్. భూములను అర్హులైన పేదలకు పంచాలని సీపీఐ సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు అన్నారు.

గురువారం సీపీఐ గణిజర్ల శాఖ మహాసభ బోయ పుల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ అర్హులైన పేదలకు విఎస్ఎస్ భూములను పంచాలని, భూ పంపిణీ సూపర్ సిక్స్ పథకాల్లో ఒక పథకంగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఎప్పటినుంచో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు భూమి కొనుగోలు పథకం కనుమరుగైందని,భూమి కొనుగోలు పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసలు భూమిలేని పేదలకు ఒక ఎకరం చొప్పున భూమి కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. భారత కమ్యూనిస్టుపార్టీ నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, రావి నారాయణరెడ్డి అనేక వందల ఎకరాల సొంత భూములను పేద ప్రజలకు పంచి పెట్టిన చరిత్ర ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు కావస్తుందని దేశవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటుందని దున్నేవాడికే భూమి కావాలని గొంతు ఎత్తి నినదించింది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. ముందుగా సీపీఐ పతాకాన్ని బోయ పుల్లయ్య ఆవిష్కరించగా, శాఖ కార్యదర్శి బోయ రాఘవరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. రాఘవపురం వయా గణిజర్ల మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి, గ్రామంలో సర్వే చేసి ఆర్ఎస్ఆర్ ప్రకారం స్మశాన వాటికలు ఎక్కడున్నాయో వెలికి తీయాలని, దానిలో కొంత భాగాన్ని ఎస్సీలకు ప్రత్యేకంగా స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఊర చెరువు ముందు భాగంలో కొంత భాగాన్ని మెరక చేసి స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, చెరువుల్లో తూములు పారేంత వరకు నీటిని వదిలిన తరువాత చెరువుల్లో ఇంజన్లతో నీళ్లు తోడే విధానాన్ని అరికట్టాలని, ఆ నీరు పశువులకు ఉపయోగపడేలా ఉంచాలని తీర్మానించారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా బోయ రాఘవరావు, సహాయ కార్యదర్శిగా చేపలు శ్రీనివాసరావులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-టి నరసాపురం: నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి చిక్కాల దుర్గ ప్రసాద్ తెలిపారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేపట్టిన పాదయాత్ర గురువారం టి నరసాపురం చేరింది. ప్రధాన సెంటర్ లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి

ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏలూరు నుండి కాకినాడ వరకు పాదయాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు.

పీజీ కోర్సులకు ఎంపికైన డాక్టర్లు

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం, లింగపాలెం, కే. గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లుగా పనిచేస్తున్న ముగ్గురు నీట్‌లో అర్హత సాధిస్తూ ఇన్ సర్వీస్ కోటాలో పీజీ కోర్సులకు ఎంపికయ్యారు.

ధర్మాజీగూడెంలోని డాక్టర్ యానిప్రీతి ఎమ్.ఎస్ గైనకాలజీలో ఏలూరు ఆశ్రమం వైద్య కళాశాలలో సీటు సాధించారు. లింగపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌గా పనిచేస్తున్న డి.సంధ్యారాణి ఎండి కమ్యూనిటీ మెడిసిన్ కోర్సుకు కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో సీటు సాధించారు. కే. గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ కృష్ణకిషోర్ ఎం.డి కమ్యూనిటీ మెడిసిన్‌కు తిరుపతి శ్రీవెంకటేశ్వర మెడికల్ కాలేజీలో సీటు సాధించారు. ఏలూరు జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లుగా పనిచేస్తున్న మరో 14 మంది డాక్టర్లు ఇన్ సర్వీస్ కోటాలో పీజీ కోర్సులకు ఎంపికయ్యారు. ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌గా పనిచేస్తున్న యాని ప్రీతి భర్త పి.అవినాష్ రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ గా పనిచేస్తూ పీజీలో ఎండి పెథాలజీ కోర్సుకు ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించారు. భార్యాభర్తలు ఇరువురు పీజీ కోర్సుకు ఎంపిక అయ్యారు. వీరిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న సిబ్బంది, ప్రజలు అభినందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొయ్యలగూడెం నుండి జంగారెడ్డిగూడెం వెళ్ళు రహదారిలో

గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా అశ్వరావు పేట మండలం ఊట్లపల్లి గ్రామానికి చెందిన సాదు భక్తవత్సల కుమార్ తండ్రి జోసఫ్ కొయ్యలగూడెం వైపు నుండి జంగారెడ్డిగూడెం వైపు స్కూటీపై వెళ్లే క్రమంలో లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధన వైపు ముందుకు సాగాలి : ఎమ్మెల్యే బడేటి చంటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : చదువులోనూ, ఆటల్లోనూ విద్యార్థులు గెలుపే లక్ష్యంగా ప్రతిభ కనపరచాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరు అల్లూరి

సీతారామరాజు స్టేడియంలో నిర్వహించిన అపుస్మా ఇంటర్ జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024 - 25 ముగింపు కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ట్రోఫీలను, ప్రశంసా పత్రాలను అందించిన ఎమ్మెల్యే చంటి వారిని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే అపుస్మా కమిటీల నాయకుల కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సాహం, ఉల్లాసం, టెక్నిక్ ఉంటేనే ఆటల్లో రాణించడం సాధ్యమన్నారు. వీటివల్ల తెలివితేటలు కూడా పెరుగుతాయన్నారు. నడిచే వారికంటే నడిపించే వారు గొప్పవారని అపుస్మా నాయకులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అపుస్మా రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ ఎంబీఏస్ శర్మ, జిల్లా అధ్యక్షులు రవికుమార్, డిఎస్‌డిఓ శ్రీనివాసరావులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అపుస్మా జోనల్ అధ్యక్షులు బుల్లబ్బాయి, స్పోర్ట్స్ కన్వీనర్ గ్లేవియర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఆర్‌కెవి ప్రసాద్, ట్రెజరర్ రామకృష్ణ, ఏలూరు, చింతలపూడి, దెందులూరు జోన్ల అధ్యక్షులు కె. వెంకటేశ్వరరావు, బి.రాంబాబు, కె.రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల హామీలను నిలబెట్టుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర -భీమవరం: ఇళ్లపై చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. కూటమి సర్కారు ఎన్నికల్లో ఇళ్ల స్థలాలపై ఇచ్చిన హామీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నాలుగో రోజు సీపీఐ భీమవరం ఏరియా సమితి ఆధ్వర్యంలో గరువుపేట రోడ్డు తదితర ప్రాంతాల్లో పేదల నుంచి ఇళ్ళ స్థలాల కై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ జగన్ ఇచ్చిన చాలీచాలని ఇళ్ల స్థలాల్లో పేదలు ఎలా నివసిస్తారని తాము పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెట్లు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని కూటమి హామీ ఏమయ్యిందని ప్రశ్నించారు. ఇళ్ల స్థలాలపై కూటమి సర్కారు మెలికలు పెట్టడం సరికాదని ఉత్తుత్తి జీఓలు చేతులు దులుపుకోవడం కుదరదని, నివేశనా స్థలాలు ఇవ్వకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాలు నిర్మిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్ర మంలో సీపీఐ జిల్లా నాయకులు వై.వి.ఆనంద్, ఎం.లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

తరుణ్ కుమార్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర -భీమవరం: ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కొట్టేడ తరుణ్ కుమార్‌కు ఎన్ఐటి జలంధర్ డాక్టరేట్ ప్రకటించింది. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత వర్మ డాక్టర్ తరుణ్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ తరుణ్ కుమార్ మాట్లాడుతూ " ఫ్యాబ్రికేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ గ్రాఫిన్ నానో ప్లేట్ లెట్స్ రియిన్ ఫోర్స్డ్ అల్యూమినియం మెటల్ మెట్రిక్స్ కాంపోజిట్" అనే అంశంపై ఎన్ఐటీ కి చెందిన ప్రొఫెసర్ మనోజ్ కుమార్ సింగ్, ప్రొఫెసర్ ప్రమోద్ కుమార్ సింగ్‌ల పర్యవేక్షణలో తాను చేసిన పరిశోధనకు గాను అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి మురళీకృష్ణం రాజు, మెకానికల్ హెడ్ డాక్టర్ కె.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

లోపూడిలో కోడిపందాల శిబిరంపై దాడి

పరారైన నిర్వాహకులు

విశాలాంధ్ర- ముసునూరు: అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా మండలంలోని లోపూడి గ్రామంలో భారీగా నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై మెరుపు దాడి చేసి 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్దనుండి రూ.42 వేల 400 నగదును, 40 ద్విచక్ర వాహనాలను, 12 కోడి పుంజులను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ముసునూరు ఎస్.ఐ.ఎం చిరంజీవి తెలిపారు. బుధవారం లోపూడి శివారు లోని ఒక మామిడి తోటలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై చాట్రాయి మండల ఎస్.ఐ. రామకృష్ణ, ముసునూరు ఎస్ఐ చిరంజీవి తమ సిబ్బందితో పక్కా ప్లాన్ ప్రకారం కోడిపందాల శిబిరంపై మెరుపు దాడి చేయడంతో కోడి పందాల నిర్వాహకులు అక్కడి నుండి పరారవ్వగా, పందెం రాయుళ్లు 9 మంది పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. పారిపోయిన పందేల నిర్వాహకుల కోసం గాలిస్తున్నట్లు సమాచారం. పట్టుబడిన వారిని ఉదయం పోలీస్ స్టేషన్కు తరలించగా,దాడి సమయంలో శిబిరం వద్ద నుంచి పారిపోయిన పందెంరాయుళ్ళు చుట్టుపక్కల ఉన్న రైతుల పొగాకు, మొక్కజొన్న, మిర్చి వంటి పంట లను తొక్కి పాడు చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లోపూడి,చుట్టుపక్కల గ్రామాల్లో సంక్రాంతి తర్వాత నుండి ప్రతి రోజు రాత్రి వేళల్లో కోడిపందాలు నిర్వహిస్తున్నారని,ఇతర జిల్లాలు,రాష్ట్రాల నుండి కూడా పందెం రాయుళ్ళు ఇక్కడికి వస్తున్నట్లు స్థానికుల నుండి సమాచారం. తప్పించుకు పారిపోయిన నిర్వాహకులను అరెస్టు చేయాలని పలువురు కోరుతున్నారు.

గాంధీజీ ఆశయాలకు కృషి చేయాలి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వర రావు అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ అహింస ఆయుధంగా పోరాటం చేసి దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చి ప్రపంచానికి ఆదర్శ వంతంగా నిలిచారన్నారు. అందరం ఆయన చూపిన మార్గంలో పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

టి నరసాపురం: టి నరసాపురంలో మహాత్మాగాంధీ వర్ధంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన

విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ సత్యా గ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గొప్ప వ్యక్తి మహాత్మాగాంధీ అన్నారు.ఈ కార్యక్ర మంలో మాదంశెట్టి మల్లికార్జునరావు, అద్దంకి రామకృష్ణ, నల్లూరి శ్రీనివాస్, అద్దంకి రవి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ల ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం పోరాడి ప్రాణం కోల్పోయిన మహాత్ముడని గాంధీజీ సేవల్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్

ప్రిన్సిపల్ పీ. మధు రాజు, అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ చైతన్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ పీ వో డాక్టర్ జి వెంకటరమణ, డాక్టర్ కె. స్వరూపరాణి, డాక్టర్ జి వి శారదా దేవి, షేక్ పర్వీన్, అధ్యాపక, అధ్యాపకేతన బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: దేశ ప్రజలలో శాంతి అహింసను ప్రబోధించిన మహాత్మా గాంధీ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వాల్మీకి విజ్ఞాన కేంద్రం ఉపాధ్యాయులు వేదుల జనార్ధన రావు అన్నారు. గురువారం

మహాత్మా గాంధీ 77వ వర్ధంతి వంకవారి గూడెం పాఠశాలలో నిర్వహించారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పుష్పాలంకరణ చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌరీ, కామేశ్వరి, మనోహర్ రెడ్డి, అమల, భవాని,కృష్ణవేణి, జగదాంబికా, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : జాతిపిత మహాత్మా గాంధీ77 వ వర్ధంతి సందర్భంగా మండలంలో కన్నాపురం గ్రామంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన అనేక పోరాటాలను చేయడం జరిగిందని క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నాపురం వాసవి క్లబ్ అధ్యక్షులు కొల్లూరి అనిల్ మనోహర్, కార్యదర్శి ఉద్దగిరి పవన్

కుమార్, పెనుగొండ హేమంత్, జోన్ చైర్మన్ పోసి బాబు, డిస్టిక్ ఇంచార్జ్ మట్టే శ్రీను, అద్దేపల్లి కేశవ, నల్లజర్ల సునీల్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు పట్టణ పరిధిలో గల జి.వి.ఎస్.వి. ఆర్.యం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా కోఆర్డినేటర్ గుంటపల్లి చిన్నయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఎం.డి.ఎం రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు. మధ్యాహ్నం భోజన పథకం స్వీకరించే హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గుడ్ల పరిమాణం పరిశీలించారు. టాయిలెట్లు, బాత్రూములు. స్కూల్ కిచెన్ గార్డెన్. పాఠశాల పరిసరాలు పరిశుభ్రతను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. దాతల ద్వారా పాఠశాల అభివృద్ధికి

నిరంతరం కృషి చేస్తున్న హెచ్ఎం భవానీ ప్రసాద్ రాయపూడిని ప్రత్యేకంగా అభినందించారు. హెచ్ఎం భవాని ప్రసాద్ సహచర ఉపాధ్యాయులకు ఆదర్శమన్నారు. అభ్యుదయ పాఠశాలకు కావలసిన అన్ని వనరులు, అర్హతలు ఈ పాఠశాలకు ఉన్నాయని చెప్పారు. ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసేందుకు సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ లింగేశ్వర్, రామకృష్ణ, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతంలో పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలి

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: గ్రామాలలో ఇండ్ల స్థలాలు లేని పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి గొలిమే బాల యేసు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాలలో 2, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మాపురం గ్రామంలో గురువారం పేదల నుండి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ మండల కార్యదర్శి బాల యేసు, దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ డప్పు కళాకారులకు, కళాకారుల పెన్షన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ లేని డప్పు కళాకారులకు పెన్షన్ దరఖాస్తులను రాయడం జరిగిందని ఆయన తెలిపారు. ద్వారకా తిరుమల మండలంలో దళిత డప్పు కళాకారులు చాలామంది ఉన్నారని వారందరికీ పెన్షన్లు వచ్చేలా ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ తిమ్మాపురం గ్రామ కార్యదర్శి యడ్లపల్లి రమేష్, పెండ్లి భూషణం, తవిటి కూటి వెంకటేశ్వరరావు, కొప్పుల రామకృష్ణ, ఉండి దుర్గారావు, ఉండి మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాల మహిళల హ్యాండ్‌బాల్ పోటీలలో సెయింట్ థెరిస్సాకు ప్రథమ స్థానం

విశాలాంధ్ర-ఏలూరు: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న అంతర్ కళాశాల మహిళల హ్యాండ్ బాల్ పోటీలు ఈనెల 27,28,తేదీలలో ఎస్.వి.వి. ఎస్.డి.డిగ్రీ కళాశాల అన్నవరంలో జరిగాయి. సి హెచ్.ఎస్.డి. సెయింట్ థెరిస్సా విద్యార్థినులు ప్రథమ బహుమతి పొందినట్లు మేనేజర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ పి.ఎం. సెలిన్ రోజ్ తెలిపారు. వీరిలో ఎ.షల్లి, జి.పుణ్య, ఎస్.జెస్సి తన్మయ్,టి. జ్యోతి,పెరియార్ యూనివర్సిటీ సేలం (తమిళనాడు) లో జరగబోయే ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ కి ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. ఈ టీమ్ కు ఏలూరు జిల్లా హ్యాండ్ బాల్ కోచ్ అయిన ఆర్.మోహన్ రవి కుమార్, ప్రోత్సహించి ఆడించారు .

ఇస్రో విజయం అద్వితీయం

విశాలాంధ్ర -భీమవరం: ప్రపంచ దేశాలు మనవైపు చూసేల చేసిన ఘనత ఇస్రో శాస్త్రవేత్తలదని వారి విజయం అద్వితీయమని డీఎన్నార్ విద్యా సంస్థల అధ్యక్షులు గోకరాజు వెంకటనరసింహరాజు అన్నారు. ఇస్రో చేపట్టిన 100వ ప్రయోగం విజయవంతం కావడాన్ని హర్షిస్తూ డీఎన్నార్ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం విజయోత్సవాలు నిర్వహించారు. శ్రీవిజ్ఞానవేదిక, కళాశాల ఈసిఈ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అంజన్ కుమార్, సంఘం సేవకులు చెరుకువాడ రంగసాయి, ఈసిఈ హెడ్ డాక్టర్ కే.వేణుగోపాల్, ఎన్.రవిచంద్ర, కే.శేఖర్ బాబు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ వి.ప్రవీణ్ పాల్గొన్నారు.

రామారావు మృతి బాధాకరం

విశాలాంధ్ర-వీరవాసరం: పలు సేవా కార్యక్రమాలు చేస్తూ, అందరికీ తలలో నాలుకగా ఉండే రామారావు మృతి చెందడం పట్ల రాయకుదురు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదర్శ బాల బాలాజీ బ్రాహ్మణ సేవా సంఘ గౌరవ అధ్యక్షులు వీరుబోట్ల రామారావు (రాముడు)(83) గురువారం మృతి చెందారు. రామారావు మృతి అత్యంత బాధాకరమని పలువురు గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు, శ్రీకృష్ణదేవరాయ కాపు తెలగా సంఘ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మహా సౌరయాగంలో ఎమ్మెల్యే ముప్పిడి

విశాలాంధ్ర - కొవ్వూరు : లోకానికి వెలుగునిచ్చే ప్రత్యక్ష భగవంతుడు సూర్య భగవానుడు ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలని కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు పట్టణంలోని శ్రీనివాసపురం గోదా వరి నదీ తీరాన వేంచేసి ఉన్న శ్రీ ప్రకృతి రావణబ్రహ్మ బ్రహ్మసూత్ర శివాలయం వద్ద నిర్వహిస్తున్న మహా సౌర యాగం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక సంరక్షణ అర్థం తలపెట్టిన మహాసౌర్యయాగం ఎంతో విశిష్టమైనదని ఆనాటి కాలంలో శ్రీరామచంద్రుడు రాజ్యంలో ప్రజలందరూ సుఖసంతోషాలు సిరిసంపదలతో ఆనందంగా జీవించాలని మహా శౌర్య యాగం నిర్వహించారన్నారు. కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలు రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని సిరిసంపదలతో తులతూగాలని కోరుతూ అనపర్తి శివరామకృష్ణ శివుడు దంపతులు మహా సూరి యాగం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ సూరపనేని చిన్ని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సూర్యదేవర రంజిత్ కుమార్ యువ గళం నాయకులు మద్దిపట్ల సురేష్ ప్రకృతి రావణబ్రహ్మ శివాలయం నిర్వాహకులు అనపర్తి శివుడు మతుకూరి వెంకటేశ్వరరావు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ముగిసిన ఉచిత పశు వైద్య శిబిరాలు

విశాలాంధ్ర - సీతానగరం : మండల వ్యాప్తంగా గత పది రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలు గురువారంతో ముగుసాయని మండల పశు వైద్య అధికారి డాక్టర్ ఫణీంద్ర అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫణీంద్ర మాట్లాడుతూ జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో సీతానగరం మండలం వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించామని అన్నారు. దీనిలో పాడి రైతులకు చేయూత ఇస్తూ ఉచిత మందులు, పశువులకు టీకాలు, గర్భకోశం వ్యాధులకు నివారణ చికిత్సలు నిర్వహించారు. దీనిలో భాగంగా గురువారం చీపురుపల్లి, నాగంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో శిబిరం ద్వారా సుమారు 92 పశువులకు, 450 జీవాలకు చికిత్సలు చేయగా 54 మంది రైతులు లబ్ధి పొందారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పునఃప్రారంభం

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని చింతలపల్లి కలింగుల నుంచి మలికిపురం మండలం గుడిమెల్లంక వంతెన వరకు ఆరేళ్లుగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులు గురువారం పునః ప్రారంభమయ్యాయి. రూ.11 కోట్ల వ్యయంతో చేపట్టే పనులను ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణంతో పలు గ్రామాల ప్రజల సమస్యలు తీరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, చింతలపల్లి సర్పంచ్ మట్టా ప్రసన్న, విశ్వేశ్వరాయపురం సర్పంచ్ చెల్లిబోయిన హెలీనా, దిరిశాల బాలాజీ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున నిత్యం రాకపోకలు

దశాబ్దాలుగా అసంపూర్తిగానే నాలుగు లైన్ల రహదారి నిర్మాణం

విశాలాంధ్ర - సీతానగరం : ప్రమాద అంచున నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు ప్రజలు. మండల ప్రజల దశాబ్దాల కల అయినా నాలుగు లైన్ల రహదారి నిర్మాణం పూర్తి కాకుండానే మిగిలిపోయింది. అయితే దీనిలో భాగంగా వెంకటనగరం సాయిబాబా గుడి వద్ద కొన్ని రోజులు క్రితం విస్తరలో భాగంగా గ్రావెల్ వేసి వదిలేశారు. దీనితో ఈ గ్రావెల్ రోడ్డు పైకి తేలి సుమారు 100మీటర్ల రహదారి రాళ్లతో నిండి ఉంచారు. దీనితో ద్విచక్ర వాహనాలు రాకపోకలు ఈ రహదారి పై ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అదీ కాక ఈ రాళ్లు పెద్ద పెద్ద వాహనాలు వెళుతున్నప్పుడు పైకి లేచి వచ్చే పోయే వాహనాలు పై పడుతున్నాయని వాహనదారులు విలపిస్తున్నారు. ఈ ప్రధాన రహదారి గుండా నిత్యం సీతానగరం మండల, తొర్రేడు గ్రామ ప్రజలు, పోలవరం ప్రాజెక్టు భారీ వాహనాలు రాకపోకలతో సాగిస్తుంటాయి. కావున అధికారులు ఈ సమస్య పై దృష్టి సారించి వాహనదారులకు ప్రమాద రహిత ప్రయాణం కలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆ బాలుడిని పాఠశాలలో చేర్పించండి : కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - రాజానగరం : ఆ బాలుడిని పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. మండలంలోని నందరాడ గ్రామానికి గురువారం విచ్చేసిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి దృష్టిలో చొల్లంగి కుమార్ స్వామి అనే మైనర్ బాలుడు కనిపించాడు. అప్పటికే తిరిగి రాజమహేంద్రవరం వెళ్లేందుకు కార్ ఎక్కిన కలెక్టర్ ఆ బాలుడిని చూసి క్రిందకు దిగి,ఆ బాలుడిని విచారించారు. దీంతో ఆ బాలుడు చెప్పిన సమాధానికి కలెక్టర్‌తో సహా అక్కడ అంతా సరదాగా కాసేపు నవ్వుకు న్నారు. తాను మేజర్, అస్సలు బడికి పోలేదని అని చెప్ప డంతో ఓపెన్ టెన్త్ కట్టించాలని, తదుపరి మత్స్య శాఖ లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆ దిశగా ఆ బాలుని చదివించాలనీ తహశీల్దార్ జి.ఏ.ఎల్.సత్యవతి దేవికి సూచించారు.

పకడ్బందీగా కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్

జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ఏపీపీ ఎస్సీ ఆధ్వర్యంలో జనవరి 31 న నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్ , ఫిబ్రవరి 4 నుంచి 25 వరకు 14 రోజుల పాటు నిర్వహించే కేంద్ర సాయుధ పోలీసు బలగాల , ఎస్ ఎస్ ఎఫ్, అస్సాం రైఫిల్ మాన్ కానిస్టేబుల్ పోస్టుల, నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో ఎగ్జామినేషన్ పరీక్షల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు స్పష్టం చేశారు. గురువారం ఉదయం కలెక్టరేట్ భవనం లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో ఏపీపీ ఎస్సి పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులతో జిల్లా నోడల్ అధికారి టి. సీతారామమూర్తితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, ఏపీపీ ఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షలు డిజిటల్ జోన్ లూథర్‌గిరి, రాజీవ్ గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, లూథర్‌గిరి, రాజమ హేంద్ర వరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 31 వ తేదీ శుక్రవారం కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్ మధ్యాహ్నం 1 గంట నుంచి మ.1.38 వరకు జరగనుందని, అభ్యర్థులను మ.12 గంటల నుంచి అనుమతించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో 30 నిమిషాల ముందు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఒక్క నిమి షం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని తెలిపారు. ఫిబ్రవరి 4 నుంచి 25 వరకు 14 రోజుల పాటు నిర్వహించే కేంద్ర సాయుధ పోలీసు బలగాల, ఎస్ఎస్ఎఫ్, అస్సాం రైఫిల్ మాన్ కానిస్టేబుల్ పోస్టుల, నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో సిపాయ్ పోసులకు 14,672 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.కేంద్ర సాయుధ పోలీసు బలగాల , ఎస్ ఎస్ ఎఫ్, అస్సాం రైఫిల్ మాన్ కానిస్టేబుల్ పోస్టుల, నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో లో సిపాయి పోస్ట్ నకు ఏపీపీ ఎస్సీ పరీక్షల ను మూడు షిఫ్టు లలో మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి 10 వరకు , రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 12 నుంచి మ.1.00 గంట వరకు , మూడో షిఫ్ట్ సా.3 నుంచి 4.00 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రంలోకి ఉదయం మొదటి షిఫ్ట్ నకు ఉదయం 7.30 నుంచి 8.30 వరకూ, రెండో షిఫ్ట్ ఉదయం 11.00 గంట నుంచి ఉ. 11.30 వరకు మూడో షిఫ్ట్‌నకు మ.2 నుంచి మ.2.30 వరకు అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఏటువంటి ఎలక్ట్రానిక్ గడ్జెట్స్, వస్తువులను అనుమతించడం జరగదన్నారు. పరీక్షా కేంద్రం ఆవరణలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలీసు బందోబస్తు, నిర్ణీత సంఖ్యలో అభ్యర్థులతో తరగతి గదుల ఏర్పాట్లు, మెడికల్ క్యాంపు, నిరంతర విద్యుత్తు సరఫరా, శానిటేషన్ వంటి చర్యలు చేపట్టాలన్నారు జనవరి 31 న జరిగే ఏపీపీఎస్సీ సిజిఎల్ పరీక్షకు 197 మంది అభ్యర్థులు హాజరవుతారని జిల్లా రెవిన్యూ అధికారి టి. సీతారామ మూర్తి తెలియ చేశారు. ఫిబ్రవరి 4 నుంచి 25 వరకు 14 రోజుల్లో వివిధ తేదీల్లో నిర్వ హించే పరీక్ష ఫిబ్రవరి 4 వ తేదీ ఉదయం , మధ్యా హ్నం షిఫ్ట్ కి 351 మంది చొప్పున , మూడో షిఫ్ట్ కి 350 మంది, ఫిబ్రవరి వ తేదీ నుంచి 7 వ తేది వరకు ప్రతి షిఫ్ట్ కి 350 మంది, ఫిబ్రవరి 10 నుంచి 25 వ తేదీ వరకు ప్రతి షిఫ్ట్ లో 349 మంది అభ్య ర్థులు పరీక్షలకి హాజరు అవుతారని తెలిపారు జిల్లా రెవెన్యూ అధికారి పరీక్షల నోడల్ అధికారి టి సీతా రామ మూర్తి, అదనపు ఎస్పీ ఏ వి సుబ్బారావు, తహ సీల్దార్ పాపా రావు, డిటి బీవీ కృష్ణ శాస్త్రి, ఇతర సమ న్వయ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం బొమ్మూరులోని శ్రీ వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో జాతి పిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా అదనపు వైద్యాధికారి డా . ఎన్ . వసుంధర ఆధ్వర్యంలో లెప్రసి కాలనీలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల సమర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి అంజలి ఘటించారు. కుష్టు వ్యాధి నిర్మూలన కోసం ఆయన చేసిన సేవలు స్మరించుకుంటూ ఈ నెల అనగా జనవరి 30 వ తేదీ నుండి ఫిబ్రవరి 13 వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమ ములు జిల్లా అంతటా నిర్వహిస్తారని ఆమె చెప్పారు . ఈ వ్యాధి సమూలంగా 2027 సంవత్సరానికి భారత దేశంలో పూర్తిగా అరికట్టడానికి ప్రజల సహకారం అవసరం అని తెలియచేశారు. ఈ సందర్భంగా బొమ్మూరు నందు గల శ్రీ వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం నందు నివసిస్తున్న 40 మంది కుష్టు రోగులకు దుప్పట్లు , పులిహోర ప్యాకెట్లు శ్రీమతి కుమారి, పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు పంపిణి చేశారు. రామచంద్రపురం పట్టణ పుర ప్రముఖులు శ్రీ గుణ్ణం రామకృష్ణ చౌదరి - 40 స్టీల్ ప్లేట్లు , గ్లాసులు అలాగే విశ్రాంత శ్రీ మానుకొండ దేవిడ్ స్వీట్స్ పంచారు .

మృతుల కుటుంబాలను బుచ్చిబాబు పరామర్శ

విశాలాంధ్ర - తాళ్లరేవు : ముమ్మిడివరం నియోజవర్గం తాళ్ళ రేవు మండలంలోని జార్జి పేట గ్రామంలో కూనపురెడ్డి ఆదినారాయణ, బత్రాజు సత్యనారాయణ అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. గాడిమొగ గ్రామంలో మరో రెండు కుటుంబాలను పరామర్శించిన అనంతరం తాళ్ళరేవు మండల ఆంధ్ర జ్యోతి విలేకరి వెంకటరమణ భార్య హిమావతి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషాదంలో ఉన్న వెంకట రమణను గురువారం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, డిసి చైర్మన్ వేగేశ్న భాస్కర రాజు, తహశీల్దార్ త్రినాధరావు, ఆర్ఐ రాంబాబు, సూపర్ డెంట్ సూరిబాబు, ఏపీఎమ్ విష్ణుమూర్తి, మాజీ ఏఎంసీ చైర్మన్ మందాల గంగ సూర్య నారాయణ, కట్టా త్రిమూర్తులు, వాడ్రేవు వీరబాబు, మోపూరి వెంకటేశ్వరరావు, వినో ద్‌రాజు మాజీ మార్కెట్ చైర్మన్ ఉంగరాల బూరిబాబులు పరామర్శించారు. అందరం ఉన్నామని..అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు జక్కుల ప్రసాద్ బాబు, కంచర్ల లక్ష్మోజీ రావు, పూడా రామకృష్ణ, దాసరి వేణుగోపాల్, మోర్తా భైరవమూర్తి, దున్నా సింహాద్రమ్మ, హేమలత, ఈశ్వరి బాయి, వడ్లమూరి సతీష్, విళ్ళ సత్యనారాయణ, నిమ్మకాయల మూర్తి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకినాడ నగరంలో కమిషనర్ భావన పర్యటన

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ.. కాకినాడ నగరపాలక కమిషనర్ భావన ఐఏఎస్ గురువారం తెల్లవారు జాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా రమణయ్య పేట కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వెహికల్ యార్డుకు వెళ్లి వెహికల్స్ పనితీరు పరిశీలించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కెటి సుధాకర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్ వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపు విషయంలో శ్రద్ధ వహించండి

కంటిచూపు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా ఆర్ఎన్ హాస్పిటల్, రే ఆప్టిక్స్ సంయుక్త నిర్వహణలో, కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కొండయ్యపాలెం శారదమ్మ ఆలయం వద్ద నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గురువారం సాయంత్రం కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ పరిశీలించారు. ఈ శిబిరంలో నగరపాలక పారిశుధ్య, ఇతర సిబ్బందికి సంపూర్ణ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 132 మంది ఈ వైద్య పరీక్షల్లో తమ కళ్లను పరీక్షించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్హెచ్ ఓ డాక్టర్ పృథ్వీచరణ్, రే ఆప్టిక్స్ మేనేజర్ రవికిశోర్, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ హరీష్‌కు ఎల్ఐసి ఏజెంట్ల వినతి

విశాలాంధ్ర - అమలాపురం : ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు రాజమండ్రి డివిజన్ ఆధ్వర్యంలో అమలాపురం ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా యూనియన్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన బుధవారం అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిలో ఎల్ఐసి యాజమాన్యంలో వచ్చిన మార్పులు పాలసీపై జిఎస్టి తగ్గించాలని ఏజెన్సీకు తగ్గించిన కమిషన్ పెంచాలని పోర్టబిలిటీ ఒక ఏజెంట్ చేసిన పాలసీని వేరొక ఏజెన్సీకు బదిలీని రద్దు చేయాలని గ్రూప్ టర్మ్ ఇన్సూరెన్స్ వయస్సు పెంచి ఏజెంట్స్ ఇన్సూరెన్స్ కల్పించాలని ఏజెంట్స్ వివిధ రకాల సమస్యలపై వినతి పత్రాన్ని ఎంపీ హరీష్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ గుమ్ములూరి వినాయకరావు, ట్రెజరర్ దొమ్మేటి శివస్వామి, అధికారి బాబ్జి, కోరుమిల్లి మధు, మట్ట దుర్గా శ్రీనివాస్, గౌడ్ కేత వీరాస్వామి, కడలి శ్రీనివాసరావు, శీలం లంకేశ్వరుడు పాల్గొన్నారు.

శుభమస్తు ఏసి ఫంక్షన్ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల

విశిష్ట అతిథిగా జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట వీరమ్మ పేరంటాల అమ్మవారి ఆలయం పక్కన దిడ్డి శ్రీను, షాపింగ్ కాంప్లెక్స్ అధినేతలు నిర్మాణం చేసిన శుభమస్తు ఏసీ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ హాజరై ఫంక్షన్ హాల్ ప్రారంభించగా విశిష్ట అతిథిగా హాజరైన జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ డైనింగ్ హాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, కొత్త కొండబాబు, పోతుల మోహనరావు, యర్రంశెట్టి బాబ్జి, దొమ్మా శ్రీను, కన్నబాబు, భరత్ బాబు, వనపర్తి బద్రి, దాపర్తి సీతారామయ్య, తమటం వీరభద్రరావు,, నాళం సూరిబాబు, కాటేపల్లి వీరభద్రరావు, చింతపల్లి వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయ స్ఫూర్తికి నడుంబిగించాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : స్వాతంత్ర్య సమరయోధుడు, జాతిపిత మహాత్మ గాంధీ ఆశయ స్ఫూర్తి కి ప్రతీ ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ అలుపెరగని పోరాటం ద్వారా స్వాతంత్ర్యం తీసుకువచ్చిన ఘనత గాంధీ మహాత్ముడుదేనన్నారు. అటువంటి జాతిపిత చూపించిన మార్గంలో యువత నడుచుకోవా లన్నారు. ఈకార్యక్రమంలో ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతివర్ధనలో : మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో గాంధీ వేడుకలు వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ రావయవు వీరబాబు, డైరెక్టర్ రాయవరపు సత్యలు విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులతో కలిసి గాంధీ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వేణు, శాంతివర్ధన్, చంటి, అప్పలరాజు, శ్రీనివాస్, శివ, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి సీఐటీయు నివాళి : మహాత్మాగాంధీ 77వ వర్ధంతి వేడుకలు గురువారం స్థానిక మెయిన్ రోడ్డు గాంధీ విగ్రహం వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు జ్యోస్యుల కృష్ణబాబు. సీఐటీయు నాయకులు సిరిపురపు శ్రీనివాస్, డి క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు. చింతల సత్యన్నారాయణ, నీలపాల సూరిబాబు తదితరులు గాంధీ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - గండేపల్లి : మండలంలోని పలు సమస్యలను పరిష్కరించేందుకే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశామని ఎంపీపీ చల్లగాళ్ళ దొరబాబు అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నాతి బుజ్జి ఆధ్వర్యంలో మండల పరిషత్ అధ్యక్షులు చల్లగాళ్ల పద్మనాభుడు (దొరబాబు) అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన సమస్యలు లేదా అవసరాలు ఏమైనా ఉంటే మండల పరిషత్ దృష్టికి తీసుకు వస్తే స్థానిక శాసనసభ్యుల వారి సహకారంతో జిల్లా స్థాయి అభివృద్ధి సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. మండల పరిషత్ బడ్జెట్ వివరాలను ఎంపీడీఓ నాతి బుజ్జి సభ్యులకు వెల్లడించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు బిట్రా వెంకటలక్ష్మి, తాహశిల్దార్ ఆర్ శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ , హెల్మెట్ ధారణ పై అవగాహన ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సిలర్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడలో నిర్వహించగా ఈ సందర్భంగా డా ఎం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు సక్రమంగా పాటిస్తే ఈ ప్రమాదాలు చాలా వరకు నివారించబడతాయి అన్నారు. రహదారి భద్రత, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్ల ప్రాముఖ్యత గురించి హెల్మెట్, సీట్ బెల్ట్ గురించి అవగాహన కల్పించడం కోసం అవగాహన ర్యాలీ చేపట్టడం అభినందనీయం అని డా శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం కాకినాడ సర్కిల్ ఇన్ స్పెక్టర్లు ఎన్ రమేష్, అధ్వర్యంలో ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు కాకినాడలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ప్రజలకు, హెల్మెట్ వినియోగం, సిగ్నల్స్ ప్రాముఖ్యతని ఎల్లప్పుడూ ట్రాఫిక్ నియమాలను పాటించండి- వాటిని విస్మరించడం ప్రాణాంతక పరిణామాలకు దారితీస్తుంది అని హెల్మెట్‌లు మరియు సీట్‌బెల్ట్‌లు ధరించండి అని ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీన్ క్యాంపస్ లైఫ్ మేనేజ్మెంట్ ప్రొ వి సత్యనారాయణ, ప్రోగ్రాం కన్వీనర్ డా బిహెచ్‌వి వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి రాంబాబు, జూనియర్ మేనేజర్ అఫియానాజర్, విద్యార్థులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు.

ఐడియల్ డిగ్రీ కళాశాలలో గాంధీజీ వర్ధంతి

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక సామర్లకోట రోడ్డు ఐడియల్ డిగ్రీ కళాశాల నందు జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభకు ప్రిన్సిపాల్ డాక్టర్ టీ సత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ చిరంజీవిని కుమారి స్వాగతోపన్యాసం చేస్తూ గాంధీ మరణించిన ఆయన ఆశయాలు, సత్యం, అహింసలు ప్రతి భారతీయుని హృదయంలో నిండిఉందని పేర్కొన్నారు. ముఖ్య అతిథి కాకినాడ సిపోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటర్ ఆఫీసర్ యమ్ మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ గాంధేయవాదాన్ని అలవర్చుకొని ఆయన చూపిన బాటలో నడవాలన్నారు. విశిష్ట అతిథి జేఎన్టీయూకే ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గాంధీజీ అంటే ఒక వ్యక్తి కాదని ఒక శక్తి అని ప్రపంచానికి దిశా నిర్దేశం చేశారని కొనియాడారు. అనంతరం "నాటి స్వతంత్ర సమరయోధుల ఆశయాలు నాడు-నేడు "అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిథులు బహుమతులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో యమ్ జవహర్ ఆలి, సయ్యద్ సలార్, చింతపల్లి సుబ్బారావు, పలివెల వీరబాబు, డాక్టర్ జి సత్యమూర్తి, కే గౌరీ నాయుడు, అయ్యగారి వెంకటేష్, పి పద్మజవాణి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి స్టీవెన్ రాజు, అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ చైర్మన్‌గా వైడి రామారావు

విశాలాంధ్ర - కాకినాడ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ నూతన చైర్మన్‌గా కాకినాడ జిల్లా శాఖ చైర్మన్‌గా ఉన్న వైడి రామారావు ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్య నిర్వాహక వర్గ సమావేశంలో రామారావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు చైర్మన్‌గా ఉన్న డాక్టర్ శ్రీధర్‌రెడ్డి రాజీనామా కారణంగా ఏర్పడిన ఖాళీలో రామారావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత 26 సంవత్సరాలుగా రెడ్ క్రాస్‌తో అనుబంధం కలిగి 8 సంవత్సరాలుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా శాఖ, కాకినాడ జిల్లా శాఖ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రామారావు అత్యున్నత జాతీయ రెడ్ క్రాస్ పురస్కారం రాష్ట్రపతి బంగారు పతకాన్ని, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ జిల్లా శాఖ పురస్కారాలను పొందిన విషయం విదితమే. ఈ సందర్భంగా పై డి రామారావును రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ సభ్యులు, జిల్లా శాఖ సభ్యులు,పట్టణ ప్రముఖులు అభినందించారు.

కార్మిక చట్టాలు పక్కాగా అమలు చేయాలి

విశాలాంధ్ర - ఆలమూరు : కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాలలో కార్మిక చట్టాలు పక్కాగా అమలు చేయాలని రిజిస్టర్లు, రికార్డులు నిర్వహించాలని మండపేట కార్మిక శాఖ అధికారి కాశీ నాగమల్లేశ్వరరావు సూచించారు. పని ప్రదేశాలలో కార్మిక చట్టాలను అమలుచేసే బాధ్యత యాజ మాన్యాలపై ఉందన్నారు. ఆయన ఆలమూరులో ఇటుక బట్టీలను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కార్మికులతో గురువారం మాట్లాడారు. అనంతరం బట్టీల వద్ద కార్మిక రికార్డులను పరిశీలించి లోపాలను సవరించుకోవాలని సూచించారు. పనిచేస్తున్నవారిలో ఒక్కొక్క కార్మికునికి రూ. వంద చొప్పున కార్మిక సంక్షేమనిధికి బ్యాంక్లో చలానా తీయాలని మల్లేశ్వరరావు తెలిపారు. కార్మికులకు కార్మిక వేతన చట్టం అమలు చేయాలని ఆయన సూచించారు.

గాంధీజీకి ఘన నివాళులు

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద వాసవి క్లబ్, ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు ముఖ్య అతిథులుగా హాజరై గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యం అహింస ఆయుధాలుగా దేశానికి స్వతంత్రాన్ని తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అన్నారు. ఈ సందర్భంగా మాజేటి సత్యనారాయణ 15 మంది పేద ఆర్య వైశ్యులకు రూ.25 వేల రూపాయలు చొప్పున వడ్డీలేని రుణాలు అందించారు. ఈ కార్యక్రమంలో బైరవకృష్ణ, దారా శ్రీనివాస్, బొండా నూక రాజు, బొండాడ జగన్, ఆర్యవైశ్యులు, వాసవి వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కొవ్వూరు : భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించడంలో మహాత్మ గాంధీజీ సత్యం అహింస మార్గాలను ఆయుధాలుగా చేసుకొని బ్రిటిష్ వారిపై పోరాటం చేశారని కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మట్టే ప్రసాద్ అన్నారు. గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కొవ్వూరు ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణం లోని మెయిన్ రోడ్ మరియు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా మట్టే ప్రసాద్ మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ జీవితం భారతీయులందరికీ ఆదర్శప్రాయమని యువత గాంధీజీ మార్గాన్ని అనుసరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కొల్లిపర శ్రీనివాస్, తుమ్మలపల్లి నాగ రమేష్, ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు మద్దుల సత్యనారాయణ, ఒలివేటి ప్రసాద్, బంగారు కాశి అన్నపూర్ణ, నాలం శ్రీనివాసరావు,వాసవి క్లబ్ అధ్యక్షులు మన్యం వీరభద్ర గుప్తా, కార్యదర్శి సత్యవరపు గురునాథ్ కోశాధికారి సత్యవరపు భరత్ కుమార్, అనిల్ సూర్య, శ్రీనివాస్ ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా మండలంలోని ధర్మవరంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళి రాజు స్వగృహం వద్ద మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళి రాజు మాట్లాడుతూ భారతదేశానికీ స్వాతంత్ర్యం రావడానికి గాంధీజీ ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశారన్నారు. ప్రధానంగా సత్యం, అహింస మార్గం ద్వారా దేశానికీ స్వాతంత్ర్యం సాధించటంలో కీలకపాత్ర పోషించిన గొప్ప మహనీయుడు మహాత్మా గాంధీ అని పేర్కొన్నారు. శంఖవరం మండలం అచ్చంపేట గ్రామంలో కుండల రమణ ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న సందర్భంగా రమణను పరామర్శించి ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకుని 5000 రూపాయలు ఆర్థిక సాయం మురళి రాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఈగల అప్పారావు, బొట్ల చైతన్య, వంపన బోయిన సత్యనారాయణ, బర్ల శీను, పల్లా అప్పలరాజు, కుండలు దేవుళ్ళు, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, జువ్వల దొరబాబు, కోనబాబ్జి, నాగేశ్వరరావు, యాళ్ల యేసు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఏలేశ్వరం : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక షిర్డినగర్‌లో గల గాంధీజీ విగ్రహానికి వైసీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ జన్మించిన అనంతరం స్వతంత్ర ఉద్యమమే లక్ష్యంగా పెట్టుకున్నారని, అహింస, సత్యాగ్రహం మార్గాలను ఎంచుకుని హింసకు తావు లేకుండా భారతదేశానికి స్వతంత్రాన్ని తీసుకుని వచ్చిన మహోన్నత వ్యక్తి బాపూజీ అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో చందక అప్పారావు, రామ్మోహనరావు, తోట వెంకట్రావు, సూర్యనారాయణ, పైల విజయ్, ఇజనగిరి ప్రసాద్, కోరాడ శ్రీనివాసరావు, అడపా దుర్గారావు, ఎస్ మల్లిబాబు, ఉడతల రమణారావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - దేవరపల్లి: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా దేవరపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద గాంధీ విగ్రహానికి దేవరపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బాబూరావు యువజన సంఘం అధ్యక్షులు సుతా పల్లి వెంకట రామారావు, వాసవి జాగృతి ఇంటర్నేషనల్ గవర్నర్ లిక్కికాకులపు కాశీకృష్ణ లితీగల బలరామయ్య ఆర్యవైశ్య సభ్యులు నివాళులు అర్పించారు.

జిల్లా కోర్టు పీపీ శేషరావుకు సత్కారం

విశాలాంధ్ర - అలమూరు : ఇటీవల గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శేషారావును గురువారం టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది కప్పల సునీల్ కుమార్ ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఉత్తమ సేవలందించి చట్టపరమైన, ప్రజా జీవితంలో చేసిన విశేష కృషికి ఉత్తమ సేవా పురస్కారం లభించిందని, ఇటువంటి అవార్డులు మరెన్నో పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి అమలాపురం రిటైర్డ్ అధికారులు చిట్టిబాబు, సత్యనారాయణ, బాల రవి తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారి ఆదేశాల మేరకు గురువారం మండల ప్రజా పరిషత్ సమావేశపు హాలులో కిశోరి వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమము కొత్తపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ ఎ గజలక్ష్మి వారి అధ్యక్షతన జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమములో ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి బికెవిఎస్ఎస్ వెంకట రామన్ పాల్గొన్నారు. 11 నుంచి 18 సంవత్సరాల కిశోరి బాల బాలికలకు సంపూర్ణ ఆరోగ్యం, ఆహారం, నైపుణ్య ఉపాధి, మొదలగు అంశాల గుర్చి చర్చించి అవగాహన కల్పించారు. గ్రామ కమిటీల ద్వారా ఉన్నత పాఠశాలలోను, జూనియర్ కళాశాలలోను కిశోరి బాల బాలికలకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమములో అధికారులు , కే విజయ భారతి ఎపియం, ఆర్యం డి గంగాధరారావు, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, వి కుమారి, కే పద్మావతి, హెల్త్ సిబ్బంది, గ్రామ స్కూల్ టీచర్స్, కళాశాల లెక్చరర్స్, సచివాలయ సిబ్బంది, పారా సంస్థ కో ఆర్డినేటర్స్, జెకెడబ్ల్యుఎస్ అంగన్ వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ వారు పాల్గొన్నారు.

అమలాపురంలో హీరో డెస్టినీ ఆవిష్కరణ

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం స్థానిక హీరో షోరూం లో హీరో వారి సరికొత్త స్కూటర్ డెస్టినీ వెహికల్‌ను పట్టణ ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిటిఓ డి శ్రీనివాసరావు, ఛాంబర్ ప్రెసిడెంట్ కలవకొలను తాతాజీ, మెకానిక్ యూనియన్ ప్రెసిడెంట్ సాధనాల సత్తిబాబు, షోరూం యజమాని వంకాయలరాజా పురుషోత్తమ్, ఇతర ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు.

జేహర బేగం వర్ధంతి కార్యక్రమం

విశాలాంధ్ర - పిఠాపురం : శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమి పీఠాధిపతి డా ఉమర్ ఆలీషా మాతృమూర్తి జేహర భేగం 7వ వర్ధంతి సందర్భంగా అజీమా జహరమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పళ్ళు, రొట్టెలు పీఠాధిపతి డా ఉమర్ ఆలీషా, అజీమా జహరమ్మ సేవా సంస్థ అధ్యక్షుడు అహ్మద్ ఆలీషా వారి సోదరులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సద్గురువర్యులు డా ఉమర్ ఆలీషా మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న వారికి సహాయంచేస్తే భగవంతునికి సేవచేసినట్లు అవుతుంది అన్నారు. అజీమా జహరమ్మ సేవా సంస్థ అధ్యక్షుడు అహ్మద్ ఆలీషా మాట్లాడుతూ తమ అమ్మ తమ మధ్య లేకపోయినా ఎప్పుడూ తమ ఆలోచనల్లో వుంటారని, ఆమె చేసిన అన్నదానం, వస్త్ర దానం మరెన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. వాటిని కొనసాగిస్తూ అమ్మ అభౌతికంగా మన మధ్యే వున్నారు అనే విధంగా అజీమా జహరమ్మ సేవా సంస్థ ద్వారా ఆమె ఆశయాలను కొనసాగించాలనే ఉద్దేశంతో గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో 200 మందికి, కాకినాడ ఉమా మనోవికాస కేంద్రంలో మానసిక వికలాంగులకు, శ్రావణి వృద్ధ ఆశ్రమంలో పాలు, పళ్ళు , రొట్టెలు పంపిణీ చేశామని అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ పల్లీ సుజాత మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బ్రతికి ఉన్న తల్లి తండ్రులనే వృద్ధ ఆశ్రమాల్లో వేస్తున్నారనిఅన్నారు. ప్రతీ ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రయాణం చేయాలని కోరుకుంటూ వారి సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలియచేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు హుసైన్ షా, ఖలీల్ షా, బాదుషా, ఆసుపత్రి సిబ్బంది, పీఠం సభ్యులు రేఖా ప్రకాష్, అల్లవరపు నగేష్, సానబోయిన కృష్ణ కుమార్, పెదపూడి చంటి తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా మాసోత్సవాలపై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక మిడి కవర్ హాస్పిటల్స్ కాకినాడలో కాకినాడ జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి ప్రమాద బాధితులకు సహాయం చేయడం మనందరి బాధ్యత అన్న అంశం పైన భాధిత కుటుంబ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల్లో గంటకు ఒకరు చొప్పున బలి అవుతున్నారు. రహదారి పైన ప్రమాదం జరిగినపుడు, ప్రమాద బాధితులను రక్షించడంలో మొదటి 60 నిమిషాలు ప్రమాద తీవ్రతను తగ్గించడానికి, మరణాలు తగ్గించడానికి చాలా కీలకమైనవి. రహదారి ప్రమాదాల్లో సహాయం చేసే వారికి రక్షణ కల్పించడానికి భారత ప్రభుత్వం నూతన చట్టం తెచ్చింది అని తెలిపారు. రహదారి ప్రమాద బాధితులకు సహాయం చేసిన వ్యక్తులకు గౌరవ సూచకంగా రూ.5000 వరకు పారితోషికం జిల్లా కలెక్టర్ మంజూరు చేస్తూ. వారి సేవలను గుర్తిస్తూ వారికి ఒక యోగ్యతా పత్రం కూడా ఇస్తారు. మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ శుభకర రావు మాట్లాడుతూ రహదారి ప్రమాద బాధితులకు సహాయకారిగా వచ్చిన వ్యక్తిని హాస్పిటల్ సిబ్బంది కానీ యాజమాన్యం కానీ మెడికో లీగల్ విషంలో లేదా వైద్యానికి అయ్యే ఖర్చుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందికి గురి చేయరు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ కమిషనర్ శ్రీధర్, మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ శుభకర రావు, రవాణా శాఖ వైద్యులు డా పద్మావతి, డా జయ ప్రకాష్, మెడికల్ సూపరింటెండెంట్ డా గౌతమ్ రామ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి సబ్సిడీపై అయిల్ పామ్ మొక్కలు

విశాలాంధ్ర - జగ్గంపేట : హార్టికల్చర్ డిపార్ట్మెంట్ ద్వారా పూర్తి సబ్సిడీ పై ఆయిల్ పామ్ మొక్కలు అందజేస్తారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ హెడ్ ప్లాంటేషన్ పట్టాభిరామరెడ్డి కోరారు. మండలంలోని గుర్రంపాలెంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం ఆయిల్ పామ్ రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పామ్ ఆయిల్ టన్ను ధర రూ.20, 290 ఉందని, ఇంపోర్టెడ్ మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొక్కలు వేసుకునే రైతులు ఈ మార్చి లోగా వేసుకోవాలన్నారు. ఆయిల్ పామ్ పంట రైతుకు ఒక పాడి కుండలాంటిదని ఒక్క సారి మొక్క నాటితే ముప్పై సంవత్సరాలు రైతుకు ఆదాయం ఇచ్చే పంట ఆయిల్ పామ్ అన్నారు. ఈ కార్యక్రమం డిజిఎమ్ ఎస్ ప్రకాష్, గ్రామ టిడిపి నాయకులు పడాల బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

– ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అధికారుల సమావేశంలో రెవెన్యూ అధికారి వెంకటరావు

విశాలాంధ్ర – కాకినాడ : జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, రెవెన్యూ, విద్యా, వైద్య ఆరోగ్యం, పోలీస్, విద్యుత్, ఏపీఎస్ఆర్టీసీ, పోస్టల్ ఇతర శాఖల అధికారులతో సమన్వయ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 05నుంచి 19 వరకు ప్రయోగ పరీక్షలు, మార్చి 01 నుంచి 20 వరకు థీరీ పరీ క్షలు జరగనున్నాయని ఈ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. కాకినాడ జిల్లాలో ప్రయోగ పరీక్షలకు 89, పబ్లిక్ పరీక్షల నిమిత్తం 56 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలు అన్ని సక్రమంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో సూచించారు. పరీక్షా సమయంలో నిరంతరాయముగా విద్యుత్ సరఫరా చేయవలిసిందిగా విద్యుత్ శాఖను ఆదేశించారు. ప్రశ్నాపత్రాల తరలింపులో తగిన ఎస్కార్ట్స్, పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ సూచించారు. విద్యార్థుల సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఏపీఎస్ఆర్టీసి పరీక్షా కేంద్రాలు దృష్టిలో ఉంచుకుని ఆయా రూట్లలో తగినన్ని బస్సులను కేటాయించాలన్నారు. పరీక్షల నిర్వహణలో అవసరమైన ఇన్విజిలేటర్ల నిమిత్తం జిల్లా విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వ ర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీ డియట్ అధికారి జీజీకె నూకరాజు, కాకినాడ జిల్లా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రత్యేక అధికారి అప్పలరాజు, జిల్లా పోలీస్, విద్యా, పంచాయతి, విద్యుత్, ఆర్టీసి, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా మాసోత్సవాలు

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు వారు మరియు జిల్లా రవాణా శాఖ వారు సంయుక్తంగా ఆధ్వర్యంలో సుమారు 200 మంది జిల్లా మహిళా పోలీస్ అధికారులు, జిల్లా రవాణా శాఖ మహిళా అధికారులు, సిబ్బంది, మహిళా రక్షక్ టీంలు, డబ్ల్యూ ఎం ఎస్ కే, జి.ఎం.ఎస్.కే లతో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి. ఎం మురళీకృష్ణ , డిస్ట్రిక్ట్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్ శ్రీ ఆర్. సురేష్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జె.ఎన్. రోడ్, రామాలయం సెంటర్, ముగ్గు పేట సెంటర్, ఆజాద్ చౌక్, దేవి చౌక్, కంబాలచెరువు మీదగా చిరంజీవి బస్టాండ్ వంకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అక్కడ నుంచి బయలుదేరి హైటెక్ బస్టాం డ్, వై జంక్షన్, సెంట్రల్ జైల్ రోడ్డు, లాలాచెరువు మీదగా జిల్లా పోలీస్ కార్యాలయం వరకు అవగా హన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మురళీ కృష్ణ మాట్లా డుతూ హెల్మెట్ ధరించడం భారం కాదని, అది మనందరి బాధ్యత అన్నారు. బండి నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వారు కూడా తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలిగి ఉండాలని, విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్ మాట్లాడుతూ మహిళా ద్విచక్ర వాహన చోదకులతో ప్రత్యేకంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇందుకు సంబంధించి సహాయ సహకారాలు అందించిన ఎస్పీ నరసింహ కిషోర్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. బాధ్యత కలిగిన మహిళలు హెల్మెట్ ధరించాలని పిలుపు ఇవ్వడం, బైక్ ర్యాలీ లో పాల్గొనడం సమాజానికి ఎంతో స్ఫూర్తిని కలిగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి(ఎస్ బి) బి. రామకృష్ణ , మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సి, హెచ్, సంపత్ కుమార్, ఎమ్, రవికుమార్, జి. రాంనారాయన్, సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు కె. చైతన్య సుమా , పి. వి. వి. సాయి కుమార్, ఇన్స్పెక్టర్ (ఎస్ బి) ఏ. శ్రీనివాసరావు , ఇన్స్పెక్టర్ ట్రాఫిక్-1 నబి, ఇన్స్పెక్టర్ ట్రాఫిక్-2 సిహెచ్. సూరిబాబు , ఇన్స్పెక్టర్(మహిళా పిఎస్) కే. మంగాదేవి ఇతర ఆర్టీవో అధికారులు, ఇతర అధికారులు , మహిళా రైడర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి రూ.15 కోట్ల నిధుల కేటాయింపు

ఎమ్మెల్యే బడేటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ఏలూరు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి 15 కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నట్లు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు 1 టౌన్‌లోని బిర్లా భవన్ సెంటర్ నుండి గడియార స్థంభం కూడలి వరకూ రూ.65 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లు పరిశీలించారు. పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే చంటి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురై ప్రమాదకారకంగా తయారై అధ్వాన్నస్థితిలో ఉన్న రహదారుల అభివృద్ధి విషయంలో తొలి నుండి కూటమి ప్రభుత్వానిది ఒకటే స్వరమని, అవే మాటలను అధికారంలోకి వచ్చిన తర్వాత చేతల్లో చేసి చూపుతున్నామన్నారు. దీనిలో భాగంగానే ఏలూరు నియోజకవర్గ వ్యాప్తంగా రహదారుల గుంతలు పూడ్చేందుకు, అవసరమైన ప్రాంతాల్లో నూతనంగా రోడ్లను నిర్మించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. ఈ రహదారి నిర్మాణాన్ని రెండు రోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్ రవిచంద్రకు ఎమ్మెల్యే సూచించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను శరవేగంగా అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎంఈ సురేంద్రబాబు, డీఈ రజాక్, ఏఈ సాయి, కో – ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్సెమ్మార్ పెదబాబు, కార్పొరేటర్లు వంకదారు ప్రవీణ్, సబ్బన శ్రీనివాసరావు,కర్రి శ్రీనివాసరావు, దేవరకొండ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మారం అను, లింగిశెట్టి శశికుమార్, అరుణ కుమారి, ఒబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర – ఏలేశ్వరం : ఫిబ్రవరి 24 నుంచి ఢిల్లీలో జరిగే ఏఐటీయూసీ 11వ జాతీయ మహా సభల విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఏలేశ్వరంలో వివిధ కార్మిక సంఘాలు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు గొడుగు సత్యనారాయణ ఈ ర్యాలీకి అధ్యక్షత వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని కల్పించి, 600 రూపాయల కనీస వేతనం ఇవ్వాలని అన్నారు. అలాగే ఈ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు కూడా వర్తింపజేయాలని పేదలందరికీ ఇళ్ల స్థలాలు, జాబ్ కార్డులు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏగుపాటి అర్జునరావు, జగ్గంపూడి రాజబాబు, నీరుకొండ నాగేశ్వరరావు, నాగులపల్లి అచ్చారావు, మహిళా సంఘం నాయకులు కిలాడి నాగమణి, అంకిరెడ్డి రత్నం పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో చంద్రబాబు విఫలం

వైసీపీ నేతల విమర్శ

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ అమలు చేయలేమని చేతులెత్తేసిందని ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు విమర్శించారు. గురువారం ఏలూరులోని జిల్లా వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏలూరు నియోజకవర్గ అధ్యక్షులు మామిళ్ళపల్లి జయప్రకాష్‌తో కలిసి నాగేశ్వరరావు మాట్లాడారు. అధికారంలోకి రాగానే సాధ్యం కాని సూపర్ సిక్స్ అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన సీఎం చంద్రబాబు ఈనెల 27వ తేదీన సచివాలయంలో ఆ హామీలు సాధ్యపడవని తేల్చేసారని విమర్శించారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 9 నెలల్లో రెండుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచగా, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య ప్రజల జీవన స్థితిగతులు అత్యంత దారుణంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను మోసం చేయాలన్నా, మభ్య పెట్టాలన్న చంద్రబాబు నాయుడు వల్లే సాధ్య పడుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు నెరవేరుస్తారనేది ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు నెరుసు చిరంజీవి, ఎన్.సుధీర్ బాబు, దాసరి రమేష్, ముస్నుల జాను గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-ఏలూరు: డ్రైవర్ వృత్తి గౌరవప్రదమైనదని, వారి ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఉపరవాణా కమిషనరు కె.ఎస్.ఎం.వి. కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఉపరవాణా కమిషనరు కార్యాలయ ఆవరణలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆయుష్ ఆసుపత్రి ఏలూరు వారిచే డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరాన్ని ఇన్‌చార్జి ఉపరవాణా కమిషనరు కె.ఎస్.ఎం.వి. కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ డ్రైవర్ వృత్తి గౌరవప్రదంతో కూడిందని, వారి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని తెలిపారు. ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే గురువారం డ్రైవర్లకు ఆయుష్ ఆసుపత్రి ఏలూరు వారి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు, శంకర్ నేత్రాలయం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి డ్రైవర్లకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి డ్రైవరు బి.పి., షుగరు, కంటిచూపు, గ్యాస్ట్రిక్ నొప్పి, వెన్నుపూస సమస్య, డ్రైవింగ్‌లో ఉన్నవారికి వచ్చే అవకాశాలు ఉన్నాయని దీనిని ముందుగానే వైద్య పరీక్షలు చేయించుకొని మందుల ద్వారా రోగాన్ని అదుపులో ఉంచుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్స్పెక్టర్ భీమారావు, గేదెల ప్రసాద్, ఎస్.జగదీష్ బాబు,దుర్గావిరల్, డాక్టర్‌బాలమురళి తదితరులు డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణకోసం తీసుకోవల్సిన జాగ్రత్తలపై హెల్త్ ఇన్సూరెన్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జంగారెడ్డిగూడెం ఆర్టీఓ మహనీయ,ఆయుష్ ఆసుపత్రి మేనేజరు జస్టిక్ కాశీనాథ్,కార్యలయ ఏవో అనంత్,మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్టీఓలు,డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్మోహినీ కేశవస్వామి శ్రవణా నక్షత్ర మాస కళ్యాణం



విశాలాంధ్ర – ఆత్రేయపురం : మండలం కేంద్రం ర్యాలి గ్రామంలోని శ్రీ జగన్మోహినీ కేశవ, గోపాల స్వామి దేవస్థానంలో గురువారం శ్రవణా నక్షత్ర మాస కళ్యాణం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కళ్యాణం జరిపించారు. తదుపరి మాస కళ్యా ణం ఫిబ్రవరి 26వ తేదీ మహాశివరాత్రి పర్వదినం రోజున జరుగుతుందని వివాహం, సంతానం, విద్య, ఉద్యోగం, బదిలీ, పదోన్నతి, విదేశీయానం, ఆరోగ్యం, వ్యాపారం తదితర కోరికలు నెరవేరేందుకు శ్రీ స్వామి వారి మాస కళ్యాణంలో పాల్గొనవచ్చని, 99113 34733 నెంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో రమణమూర్తి సూచించారు.